# అట్టహాసంగా గురుకుల స్పోర్ట్స్ మీట్


యోగా విన్యాసాలు చేస్తున్న క్రీడాకారులు

- భువనగిరిలో ప్రారంభమైన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల పోటీలు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 13 : 2023-2024కు సంబంధించి 9వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా భువనగిరి పట్టణ పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీలను డీసీపీ రాజేశ్ చంద్ర, జడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి జిల్లాల ప్రాంతీయ సమన్వయాధికారి రజిని ప్రారంభించారు. జాతీయ, ఒలంపిక్స్, సొసైటీ జెండాలను ఓవరాల్ ఇన్‌చార్జి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్ ఎగురవేశారు. ముందుగా వివిధ కళాశాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. భువనగిరి విద్యార్థుల యోగా ప్రదర్శన ఆకట్టుకుంది. పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ క్రీడా పోటీలను స్ఫూర్తిగా తీసుకొని, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. జడ్పీ సీఈఓ సీహెచ్.కృష్ణారెడ్డి మాట్లాడుతూ మనము శారీరకంగా, మానసికంగా బలపడాలంటే క్రీడలు చాలా ఉపయోగపడతాయన్నారు. ఆర్‌సీఓ ఎన్.రజిని మాట్లాడుతూ నిరంతర సాధనతోనే విద్యార్థుల్లో అన్ని రంగాల్లో రాణించవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ శ్రీనివాస్, కోచ్‌లు మధు నాయక్ పాల్గొన్నారు.

### మొదటిరోజు క్రీడాపోటీలు

మొదటి రోజు 5వేల మీటర్స్ అండర్-17 కేటగిరీలో మిర్యాలగూడకు చెందిన ప్రథమ స్థానం బి.గోపీచంద్, నకిరేకల్‌కు చెందిన ఎం.సర్దార్ ద్వితీయస్థానం, స్టేషన్‌ఘనపూర్ చెందిన ఎం.శ్రీశాంత్ తృతీయ స్థానంలో నిలిచారు.అండర్-19 విభాగంలో రాజాపేటకు చెందిన ఎల్.గోపీచంద్, ప్రథమ స్థానం, తిప్పర్తికి చెందిన ఎ.వంశీ ద్వితీయ స్థానం, అనుములకు చెందిన బుచ్చిబాబు తృతీయ స్థానాన్ని సాధించారు.

### 16వరకు క్రీడాపోటీలు

శుక్రవారం నుంచి ఈ నెల 16వరకు 9వ జోనల్ లెవల్ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు యాదాద్రి భువనగిరి, జనగాం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పరిధిలోని 13 సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల క్రీడాకారులు ఒక్కో పాఠశాల నుంచి 85మంది చొప్పున మొత్తం 1105మంది హాజరయ్యారు. పాల్గొన్న క్రీడా కారులకు వాలీబాల్, కబడ్డీ, లాంగ్‌జంప్, హై జంప్, షార్ట్‌పుట్, అథ్లెటిక్స్, రన్నింగ్, ఖోఖో పోటీలను నిర్వహిస్తారు. విజేతలను ఆయా జట్లుగా ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేయనున్నారు.

# భాస్కర్‌రావు సేవలు భేష్


అభివృద్ధి కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, రవీంద్రకుమార్

- అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టాలి
- ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్
- మిర్యాలగూడ నియోజకవర్గ ప్రగతిపథం పుస్తకం ఆవిష్కరణ

మిర్యాలగూడ, అక్టోబర్ 13: అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాల అమలులో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పకడ్బందీగా వ్యవహరిస్తున్నారని, ఆయన సేవలు అద్వితీయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రశంసించారు. తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ సహకారంతో మిర్యాలగూడ నియోజకవర్గంలో జరిగిన, జరగబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను 'మిర్యాలగూడ నియోజకవర్గ ప్రగతిపథం' అనే పుస్తక రూపంలో తేగా శుక్రవారం మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజవకర్గాన్ని ఎమ్మెల్యే భాస్కర్‌రావు ప్రగతిపథంలో నడిపిస్తూ సరికొత్త పుంతలు తొక్కిస్తున్నారని కితాబిచ్చారు. భాస్కర్‌రావు సారథ్యంలో మిర్యాలగూడ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మరింత బలోపేతం అయ్యాయని ప్రశంసించారు. వచ్చే భాస్కర్‌రావు ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ప్రచారస్త్రంగా సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భాస్కర్‌రావుకు మంత్రి కేటీఆర్ సూచించారు.

# సీఎం కేసీఆర్ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక


నకిరేకల్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

కేతేపల్లి, అక్టోబర్ 13 : సీఎం కేసీఆర్ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ క్యాంపు కార్యాలయంలో మండలంలోని కొండకిందిగూడెం గ్రామానికి చెందిన 100మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. మూడోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో నర్సింగ్ నాగయ్య, టంగుటూరి రవి, టంగుటూరి శ్రీను, బెజవాడ వెంకన్న, బెజవాడ బుచ్చయ్య, నర్సింగ్ భిక్షమయ్య, నర్సింగ్ సైదులు, గరిక వెంకన్న, నర్సింగ్ సతీశ్, రాచకొండ సైదులు, బెజవాడ లింగయ్య, పెద్ది నాగులు, పోగుల నాగయ్య, పుట్ట సైదులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు బంటు మహేందర్, బొప్పని సురేశ్, బొజ్జ అరవింద్, సర్పంచ్ గోలి మంజులావేణుమాధవరెడ్డి, ఉపసర్పంచ్ పెరిక ప్రభాకర్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు బీఆర్ఎస్‌లో చేరిక

రామన్నపేట : రామన్నపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గురిజాల మహేశ్‌రెడ్డి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు.

వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి సాదరంగా బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పోతరాజు సాయికుమార్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బత్తుల వెంకటేశం, గ్రామశాఖ అధ్యక్షుడు బుర్రి శ్రీశైలం పాల్గొన్నారు..

# అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరికలు


గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

నాగారం, అక్టోబర్ 13 : ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌లో పలువురు చేరుతున్నారని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మండలంలోని పసునూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిత్తలూరి విజయ్, రామ్మూర్తి, వెంకటేశ్, సైదులు, శ్రీకాంత్, గణేశ్, సాయి, మహేశ్‌తో పాటు 30మంది నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను తెలంగాణలో ప్రవేశపెట్టిన మహనీయుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. సీఎం కేసీఆర్ మూడోసారి ముచ్చటగా విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రైతు బంధు సమితి జిల్లా సభ్యులు పొదిల రమేశ్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు చిత్తలూరి వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ మల్లెపాక కృష్ణ, తిరుమలగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్లగంటి మల్లయ్య, వార్డు సభ్యులు చిత్తలూరి వెంకన్న, యూత్ నాయకులు తోడ్సు సతీశ్, రెడ్డబోయిన గణేశ్, తోడ్సు ఉమేశ్ పాల్గొన్నారు.

# అభివృద్ధిని ఆశీర్వదించేందుకే చేరికలు

- ఎమ్మెల్యే నోముల భగత్



రాజుయాదవ్‌కు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

నిడమనూరు, అక్టోబర్ 13 ః సీఎం కేసీఆర్ పాలనలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆశీర్వదించేందుకే ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పిల్లి రాజుయాదవ్ ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధిలో వెనుకబాటుకు గురైన సాగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టాకే అభివృద్ధి మొదలైందన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సలహాదారు బొల్లం రవియాదవ్, నాయకులు బొల్లం సైదులు, ఆదిమల్ల భాస్కర్, వెంపటి పుల్లయ్య, పెదమాం రాజు, జాల మల్లేశ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి
- 40కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక


హుజూర్‌నగర్‌లో గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబర్ 13 : మోసపూరిత కాంగ్రెస్, బీజేపీని నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో డీసీఎంస్ మాజీ చైర్మన్ జల్లేపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైస్‌ఆర్‌టీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మర్రి యశోదరెడ్డి, హుజూర్‌నగర్ పార్టీ మండలాధ్యక్షుడు మర్రి రవీందర్‌రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు నారం శెట్టి వెంకటమ్మ, కార్యదర్శి సర్విశెట్టి సత్య, టౌన్ మహిళా అధ్యక్షురాలు నూకపంగు కవిత, యూత్ కార్యదర్శి అశోక్, వార్డు ఇన్‌చార్జి గూడెపు మహేశ్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన 40కుటుంబాల వారు ఎమ్మెల్యే సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ మూడోసారి ముచ్చటగా కేసీఆర్ సీఎం కావడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుంట సైదులు, సక్కుభాయి, భవాని, నవ్య, భాగ్యమ్మ, కోట కస్తూరి, వెంకటమ్మ, లావన్య, స్వాతి, భద్రయ్య, రజని, బుజ్జమ్మ పాల్గొన్నారు.